అమ్మవారి సన్నిధిలో పలు వైదిక కార్యక్రమాలు

బాసర, ఆగస్టు 18 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని ప్రత్యేక వైదిక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ నెల 23వ తేదీ శుక్రవారం రోజు మహిళలచే సామూహిక సౌభాగ్య లక్ష్మీ వ్రతం, 27వ తేదీ మంగళవారం విద్యార్థిని, విద్యార్థులచే సామూహిక విద్యాలక్ష్మీ వ్రతం, 30వ తేదీ శుక్రవారం సామూహిక శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు గమనించాలన్నారు.

ఇంట్లో చోరీ : రెండు తులాల బంగారం అపహరణ

నిర్మల్ అర్బన్, ఆగస్టు 18 : నిర్మల్‌లోని సోమవార్‌పేట్ కాలనీలో అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులంతా ఉక్కపోత భరించక ఇంటి డాబాపైన పడుకున్నారు. ఇంటి లోపల ఎవరూ లేరని గ్రహించిన దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు నెక్లెస్, 200 గ్రాముల వెండి, రూ.50 వేల నగదును అపహరించుకుని పోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో న్యాయమూర్తులు

బోథ్, ఆగస్టు 18 : బోథ్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన ఏడుగురు విద్యార్థులకు ఆదివారం వినాయక్‌రావ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. ఆదివారం ప్రగతి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏ గ్రేడ్ సాధించిన ఏడుగురు విద్యార్థులకు రూ.7 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బీ హస్సేన్, రిటైర్డ్ న్యాయమూర్తి శ్యామ్ మోహన్‌రావ్ అందించారు. ఈ సందర్భంగా వినాయక్‌రావ్ మెమోరియల్ ట్రస్ట్‌ను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, కార్యదర్శి అంబదాస్, న్యాయవాదులు మోహన్‌రావ్, సుభాష్, పంద్రం శంకర్, ఆడెపు హరీశ్, అంగద్ కేంద్రె, ఎట్టం రాములు, కే పోశెట్టి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలి

ఎంపీ నగేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

బోథ్, ఆగస్టు 18 : బోథ్ పట్టణ పద్మశాలీ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం నాయకులు, సభ్యులు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జీ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎంపీ రెండు విడుతలుగా భవనానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు తెలిపారు.

'ఐతారం ముచ్చట్లు' కవితా పఠనం

భీంపూర్, ఆగస్ట్18: ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం ఐతారం ముచ్చట్లు వేదికగా గూగుల్ కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ, స్థానిక అంశాలపై కవులు తమ కవితలు వినిపించారు. ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ సమీక్షించి సూచనలు చేశారు. ఈ సమ్మేళనంలో కవులు బీ.బాబన్న,లక్ష్మీనారాయణ , సాయి ప్రియ, అకీరా, శైలజ, వీరన్న, రిజ్వాన్, నల్లగొండ రమేశ్, గంగన్న ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

పూర్తి కాని కల్యాణ మండప నిర్మాణ పనులు

అసంపూర్తిగా కల్యాణ మండపం వద్ద గద్దె, ఫ్లోరింగ్ పనులు

కుంటాల, ఆగస్టు,18 : కుంటాల మండలం సూర్యాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.45లక్షలతో చేపడుతున్న కల్యాణ మండప నిర్మాణానికి గతంలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిధులలో 9 లక్షలు కంట్రిబ్యూషన్ కింద గ్రామస్తులు సమకూర్చారు. ఇప్పటికే పనులు పూర్తికావాల్సి ఉండగా ఫ్లోరింగ్ , గద్దె నిర్మాణం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి సంవత్సరం శ్రావణమాసం, శివరాత్రి సందర్భంగా ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రద్దీ ఉంటుంది. ఈ కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తే ఆలయ కార్యక్రమాలకు, పేదింటి పిల్లల పెళ్లిళ్లు, శుభకార్యాలకు సౌకర్యవంతంగా ఉంటుందని ఇప్పటికైనా త్వరగా పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు కోరుతున్నారు.

తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక

తుడుందెబ్బ మండల కమిటీని ప్రకటిస్తున్న ఆదివాసీ గిరిజన పెద్దలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 18: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో తుడుందెబ్బ జిల్లా కమిటీ, తొమ్మిది తెగల జాతి పెద్దల సమక్షంలో తుడుందెబ్బ మండల కమిటీని ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం తుడుందెబ్బ జిల్లా కమిటీ, తొమ్మిది తెగల జాతీ పెద్దల సమక్షంలో తుడుందెబ్బ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుర్కా చిత్రు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భరత్, ఉపాధ్యక్షులుగా దుర్వ జుగాదిరావ్, సోయం వినోద్‌కుమార్, ముకాడే ఉత్తమ్, చాహకటి మానిక్‌రావ్, చిక్రం రాము, కోశాధికారిగా మెస్రం జైరాం, కార్యదర్శిగా సోయం మురారి, కమిటీ సభ్యులుగా మెస్రం భీంరావ్, కుమ్ర భీంరావ్, ఆత్రం హనుమంత్‌రావ్, జుగ్నాక్ జాలింషావ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్ తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు సిడాం భీంరావ్, మెస్రం వెంకట్‌రావ్, కోట్నాక్ దేవ్ షావ్, వెట్టి రాజేశ్వర్, మెస్రం చిన్ను, కనక తుకారాం, ఆర్కా ఖమ్ము, కుమ్ర కేశవ్‌రావ్, రాందాస్, బారిక్‌రావ్, సుంకట్ రావ్, నాగ్‌నాథ్, హనుమంత్‌రావ్, నాగోరావ్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

ఎదులాపురం, ఆగస్టు 18 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో కృష్ణ సూచించారు. 33వ వార్డులో డెంగీ పాజిటివ్ నమోదు కావడంతో ఆదివారం అక్కడ డ్రై డేతో పాటు డెంగీ నివారణకు చర్యలు చేపట్టారు. కాలనీలో స్ప్రే చేయించి యాంటి లార్వ యాక్టివిటిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కృష్ణ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియాధికారి శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ సాయిరాం, సిబ్బంది అనిల్, ఉదయ్, ఏఎన్ఎం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న బాసర ఏఎస్ఐ

బాసర, ఆగస్టు 18 : బాసర ఏఎస్ఐగా పని చేస్తున్న ఉజ్వల తన నిజాయితీని చాటుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఓ భక్తురాలు ఆదివారం అమ్మవారి దర్శించుకునేందుకు వచ్చింది. తన 12 గ్రాముల బంగారు గొలుసును పోగుట్టుకుంది. అక్కడే విధుల్లో ఉన్న బాసర ఏఎస్ఐ ఉజ్వల ప్రోటోకాల్ అనంతరం వదిలి పెట్టిన తన పాదరక్షల ధరించే సమయంలో పాదరక్షల వద్ద బంగారు గొలుసు కనిపించింది. అక్కడ ఉన్న వారిని అడగి పోగుట్టుకున్న భక్తురాలిని గుర్తించి తనకు అందజేసింది. నిజాయితీని చాటుకున్న ఏఎస్ఐ ఉజ్వలను ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్ఐ గణేశ్, భక్తులు అభినందించారు.

ప్రశాంతంగా రాష్ట్ర అధ్యక్షుడి కోసం ఎన్నికలు

ఎదులాపురం, ఆగస్టు 18 : పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి కోసం ఆదివారం జిల్లాలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల్లో 936 మంది ఓటర్లకు గాను 450 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు భాస లింగన్న, చంద్రమోహన్, చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడి పోటీ కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఈవోకు సన్మానం

భీంపూర్, ఆగస్టు 18: భీంపూర్ మండలం నిపాని క్లస్టర్ నుంచి యాపల్‌గూడకు బదిలీపై వెళ్తున్న ఏఈవో మహేశ్‌ను ఆదివారం నిపానిలో రైతులు, నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు మార్నెట్టి అనిల్ మాట్లాడుతూ ఏఈవో మహేశ్ రైతులకు అందించిన సేవలను అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కేమ రాజన్న , నారాయణరెడ్డి , మల్లెలస్వామి ,సంతోష్, కిష్టన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు

జైనథ్, ఆగస్టు 18 : జైనథ్‌కు చెందిన కొండ్రు సంతోష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వృత్తి రీత్యా చాకలి కుటుంబంలో పుట్టిన ఆయన ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ భార్య పిల్లలను పోషిస్తూ ఉండేవాడు. కుటుంబ యజమాని మృతి చెందడంతో భార్య పిల్లలు తల్లడిల్లి పోయారు. సంతోష్ తోటి స్నేహితులైన పదో తరగతి 2008-09వ బ్యాచ్ జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం మృతుడు సంతోష్ ఇంటికి చేరుకొని తమవంతు సహాయంగా రూ.20 వేలు సంతోష్ భార్య పిల్లలకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్నేహితులు రాకేశ్ రెడ్డి, శంకర్, రాములు, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

బోథ్, ఆగస్టు 18 : నిగిని గ్రామానికి చెందిన మట్ట సరస్వతి(17) పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బుల విషయంలో కుటుంబ సభ్యులు మందలించడంతో పొలం పనులకు వెళ్లి పురుగుల మందు తాగింది. గ్రామస్తులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోథ్ పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ సరస్వతి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ గంగారెడ్డి తెలిపారు.

దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

ఇచ్చోడ, ఆగస్టు 18 : దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇచ్చోడలోని చికెన్ సెంటర్ గల్లీలో బేకరి వద్దకు శనివారం రాత్రి 11:30 గంటలకు మతిస్థిమితం సరిగ్గా లేని తుమ్మల రితీశ్‌రెడ్డి వచ్చి సిగరేట్ ఇవ్వాలని అడిగాడు. బేకరి యజమాని షేక్ జునేద్ సిగరేట్లు లేవని చెప్పాడు. దీంతో రితీశ్‌రెడ్డి కోపంతో షాపులోని చాక్లెట్ డబ్బాలు, ఇతర సామగ్రిని కింద పడేశాడు. రితీశ్‌రెడ్డి అతని తమ్ముడు సతీశ్‌రెడ్డికి ఫోన్ చేసి పిలిపించాడు. సతీశ్‌రెడ్డి అక్కడికి వచ్చి రాళ్లతో షాపుపై దాడి చేశారు. వెంట తెచ్చుకున్న కత్తితో సయ్యద్ మినాహాజ్ కుడి చెవిపై దాడి చేశారు. ఆదివారం సయ్యద్ మినాహాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

21న జిల్లా బంద్

ఎదులాపురం, ఆగస్టు 18 : ఇటీవల సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 21వ తేదీ ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపులో భాగంగా తమ మద్దతు తెలుపుతున్నామని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావ్ వాగ్మారే తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ బంద్‌కు అందరూ సంపూర్ణ మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సంఘాలందరూ ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాదాసాహెబ్ జాబాడే, ఉపాధ్యక్షుడు రంగ్‌రావు వాటోరే, సభ్యులు ఉద్ధవ్ సూర్యవంశీ, కళ్యాణ్ పాల్గొన్నారు.

రాఖీ అమ్మకాలతో వచ్చిన డబ్బులు అనాథాశ్రమానికి

భైంసా, ఆగస్టు 18: రాఖీ అమ్మకాలతో వచ్చిన డబ్బులు అనాథాశ్రమానికి డొనేట్ చేస్తామని వేదం పాఠశాలకు చెందిన విద్యార్థులు బెస్ట్ ఫ్రం వెస్ట్ అనే కాన్సెప్ట్‌తో రాఖీలు తయారు చేసి ఆదివారం ఉదయం ఈ రాఖీలను బస్టాండ్ సమీపంలో విక్రయించారు. పైగా ఈ రాఖీలు అమ్మగా వచ్చిన డబ్బులు అనాథాశ్రమానికి అందజేస్తామని విద్యార్థులు పేర్కొనడం విశేషం.

రక్షాబంధన్ సందడి

రాఖీలు కొనుగోలు చేస్తున్న పలువురు

భైంసా, ఆగస్టు 18 : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఘనంగా జరుపుకునేందుకు భైంసా పట్టణం సమాయత్తమవుతున్నది. ఈ నేపథ్యంలో రాఖీల అమ్మకాలు భైంసాలో ఊపందుకున్నాయి. ఇప్పటికే రహదారుల వెంట విక్రయ కేంద్రాలు వెలిశాయి. వెరైటీ రాఖీలకు మంచి ఆదరణ ఉండడంతో ఎప్పటిలాగే ఈ సారి కూడా సరికొత్త రాఖీలు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి.

రేపటి నుంచి ఎంపిక శిబిరం

ఎదులాపురం, ఆగస్టు 18 : ఆదిలాబాద్ జిల్లా దివ్యాంగులకు సహాయ ఉపకరణాలకు మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎం.సబిత ఒక ప్రకటనలో తెలిపారు. అలింకొ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంపిక శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈ నెల 20న నార్నూర్ జిల్లా పరిషత్ హై స్కూల్, 21న బోథ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలుర), 22న ఆదిలాబాద్ ప్రభుత్వ గెజిటెడ్ హైస్కూల్ నం.1లో శిబిరానికి ఆసక్తి గల వికలాంగులకు వారి సదరం ద్వారా పొందిన ధ్రువీకరణ పత్రం, ఇటీవల పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిక్ ఐడీ కార్డు (యూడీ ఐడీ కార్డు) తప్పక తీసుకొని రావాలని తెలిపారు. క్యాంపు ఉదయం 10.30 నిమిషాల నుంచి 3.30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 08732-222058 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

నిర్మల్‌అర్బన్: నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం నిర్మల్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గల పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ కులస్థులతో కలిసి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో నాయకుడు పొన్న నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరవేణి నర్సాగౌడ్, సత్యనారాయణ, భాస్కర్, గౌడ కులస్థులు పాల్గొన్నారు.

తాంసి, ఆగస్టు 18 : రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి మరవలేనిదని గౌడ సంఘం నాయకుడు, మోపు దెబ్బ అధ్యక్షుడు లస్మాగౌడ్ అన్నారు. ఆదివారం కప్పర్ల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శంకర్ గౌడ్, అరుణ్ కుమార్ గౌడ్, మల్లేశ్ గౌడ్, రాములు గౌడ్, రమేశ్ గౌడ్, దిలీప్ గౌడ్ పాల్గొన్నారు.

ఖానాపూర్, ఆగస్టు 18 : ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనం వద్ద గౌడ సంఘం నాయకులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర కన్వీనర్ నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకులు భాస్కర్, మల్లేశం గౌడ్, శంకర్ గౌడ్, రమణ, ప్రకాశ్, జగన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడెం, ఆగస్టు 18: కడెంలోని పాపన్నగౌడ్ విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర రమేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, తిరుపతిగౌడ్, రామాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, దశగౌడ్, పోషగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, రవిగౌడ్, సాయిగౌడ్, కడెం మాజీ సర్పంచ్ చిన్నయ్య పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, ఆగస్టు 18: నిర్మల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో భుజంగ్‌రావ్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, జిల్లా వైద్యాధికారి రాజేందర్, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దస్తురాబాద్, ఆగస్టు 18 : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కులస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కలలుకన్న రాజ్యాన్ని సాధిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ అన్నారు. ఆదిలాబాద్‌లోని బస్టాండ్ సమీపంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు చీటి వెంకటేశ్, మండలాల బాధ్యులు కొండ మడుగు గణేశ్, శేఖర్, రమేశ్, రాంచందర్, సర్కిల్ నరేశ్, నవీన్ కుమార్, రాజు, కీపర్ గంగన్న, వినుకుమార్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద, ఆగస్టు 15 : కనకాపూర్ గ్రామంలో మండల గౌడ సంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండలాధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, నాయకులు మేడి నారాగౌడ్, న్యాయవాదులు లింగాగౌడ్, రమణాగౌడ్, గంగాధర్ గౌడ్, అంజగౌడ్, రామ గౌడ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 18: పాపన్న గౌడ్ సేవలు మరువలేనివని మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపతి లింగాగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాథోడ్ రితీశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎన్టీఆర్ చౌక్‌లో పాప్పన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, ధరణి రాజేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సర్దార్ పాపన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

తాంసి: కప్పర్లలో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

బంగారం షాపు యజమానులకు బెదిరింపు ఫోన్ కాల్

ఎదులాపురం, ఆగస్టు 18 : హాలో నేను వన్ టౌన్ ఎస్ఐని మాట్లాడుతున్నాను మీ మీద పాత కేసులు ఉన్నాయి. ఏమన్నా కేసులుంటే సెటిల్‌మెంట్ చేసుకోవాలి లేదా అవసరమైన ఇంకా కేసులు బుక్ చేసి జైలులో పెట్టిస్తామంటూ ఆంధ్రప్రదేశ్‌లోని బంగారం షాపు యజమానులకు బెదిరింపులకు ఫోన్ కాల్ వస్తున్నాయి. ఈ విషయం అక్కడ పోలీసులు తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా పోలీసులు విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ బీ సునీల్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల నుంచి ఆదిలాబాద్ వన్ టౌన్ ఎస్ఐ అంటూ వస్తున్న ఫేక్ కాల్స్ వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. అన్నోన్ నకల్ వచ్చిన నంబర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బాల్య మిత్రుల సాయం

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 18: బీర్నంది గ్రామనికి మెట్టి రవీందర్ గుండె పోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి 2010-11 పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆర్థిసాయం అందజేసి భరోసాగా నిలిచారు. ఇక్కడ రాజేశ్, సురేశ్, రాజ్‌కుమార్, సతీశ్, శ్రీకాంత్, సత్తన్న, శ్రీనివాస్, వంశీ, మిత్ర బృందం ఉన్నారు.

రుణమాఫీ కానివారు ఆందోళన చెందవద్దు

భైంసా, ఆగస్టు 18 : అర్హులై ఉండి రుణమాఫీ కానివారు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం భైంసాలోని విశ్రాంతి భవనంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో ఫోన్‌లో మాట్లాడారు. రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు రూ. 2 లక్షలు పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయాలని అన్నారు. అంతేగాకుండా అర్హులై ఉండి రుణమాఫీ కాని వారు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 18: గ్రామాల్లో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. ఆదివారం ధర్మాసాగర్ గ్రామంలో గంజాయితో పాటు చట్టాలు, డ్రగ్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 18 : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం వేణునగర్, లక్కారం గ్రామాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఎక్బాల్, ఖయ్యూం, అశోక్, నర్సయ్య, చంద్రయ్య, రాజేశ్వర్, దేవానందం ఉన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజేశ్, నాయకులు

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 18 : మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. ఆదివారం గంగన్నపేట్‌లోని చేతన కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముజీబ్, మహేందర్, సోనేరావ్, భూమన్న, ప్రభాకర్, పాల్గొన్నారు.

ఈవోగా రమేశ్ బాధ్యతల స్వీకరణ

సారంగాపూర్, ఆగస్టు 18 : మండలంలోని మహ అడెల్లి పోచమ్మ ఆలయం గ్రేడ్-2 ఈవోగా బల్లు రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పని చేసిన రవికిషన్‌గౌడ్ ఆదిలాబాద్ జిల్లాకు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల వేలాల మల్లన్న స్వామి ఆలయ ఈవోగా పని చేసిన రమేశ్ అడెల్లి పోచమ్మ ఆలయ ఈవోగా బదిలీపై వచ్చారు.

ఘనంగా ముందస్తు రాఖీ పౌర్ణమి

రాఖీ కడుతున్న విద్యార్థులు

ఇచ్చోడ, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని ఫస్ట్ స్టెప్స్ యూపీఎస్ పాఠశాలలో ఆదివారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకొని 'నీకు నేను రక్ష, నువ్వు నాకు రక్ష, మనం దేశానికి రక్ష' అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బిల్కిస్ ఖాన్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కపిల్ రెడ్డి, అనురాజ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షా బంధన్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 18 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్త లక్ష్మణరావు, జ్ఞానేశ్వర్, జిల్లా సంఘ చాలక్ నూకల విజయ్ కుమార్, నగర సంఘ చాలక్ తుమ్మల ప్రమోద్ చంద్రా రెడ్డి, జిల్లా కార్యవాహ అశోక్, మంచిర్యాల నాగభూషణ్, గంగిశెట్టి ప్రవీణ్, కిన్నెర రవి, మూట గణేశ్ పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో..

అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. స్థానిక శివకోటి మందిరం వద్ద రక్షా బంధన్ వేడుకలు నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ రాఖీలు పంపిణీ చేశారు. రాఖీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, సాయి, నవీన్, శ్రీనివాస్, లక్ష్మీపతి, యురాజ్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దస్తురాబాద్, ఆగస్టు 18 : దస్తురాబాద్ మండలం ఎర్రగుంట గ్రామంలో శనివారం అజ్మీరా రాజేశ్(31) అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం..అజ్మీర రాజేశ్ గ్రామంలో పొలానికి వెళ్లి గడ్డికోస్తుండగా విద్యుత్ వైర్లకు మిషన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నేరడిగొండ, ఆగస్టు 18 : మండల కేంద్రానికి చెందిన గాజుల రామయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, నాయకులు సురేందర్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

బోథ్, ఆగస్టు 18 : ధన్నూర్(బీ), బోథ్ గ్రామాలకు చెందిన పలు బాధిత కుటుంబాలను ఆదివారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు నగేశ్ పరామర్శించారు. ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన రమణారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబసభ్యులను ఓదార్చారు. ముద్దం గంగుబాయి, వెంకటి, బ్రహ్మం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. బోథ్‌కు చెందిన అల్లకొండ భోజన్న, లక్ష్మణ్ కుటుంబాలను ఓదార్చారు. ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన నాయకులు రాజేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో బాధ పడుతుండడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎంపీ వెంట బోథ్, బజార్‌హత్నూర్, సొనాల మండలాల నాయకులు ఉన్నారు.

తలమడుగు, ఆగస్టు 18 : బీఆర్ఎస్ నాయకుడు రమాకాంత్ సోదరి మల్లీశ్వరి ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జిల్లా కేంద్రంలోని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.